పేదల అభ్యున్నతే సీఎం లక్ష్యం


లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

జామి: పేద ప్రజల అభ్యున్నతే సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని అలమండ గ్రామంలో శనివారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలోని ప్రతీ ఇంటికి వెళ్లి వారి సమస్యలు తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా వారికి కలిగిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతీ గడపకు సంక్షేమ పథకాలు అందాలని, పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక బృహత్తర సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజల ముంగిటకే పాలన అందిస్తున్నారన్నారు. పార్టీలు, కులమతాలకు తావులేకుండా కేవలం అర్హతే ప్రమాణికంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. భవిష్యత్‌లో సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డినే సీఎంను చేయాలని కోరారు. నియోజకవర్గ ప్రజలందరికీ కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గొర్లె సరయు, ఎంపీపీ సబ్బవరపు అరుణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, మాజీ ఎంపీపీ కాకర్లపూడి సూరిబాబురాజు, వైస్ ఎంపీపీ గేదెల వెంకటరావు, సర్పంచ్ కోట పాపమ్మ, ఉప సర్పంచ్ లగుడు దేముడు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నేతలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

జామి: మండలంలో అలమండ గ్రామానికి చెందిన కె.కృష్ణంరాజుకి కాలేయం మార్పిడికి సంబంధించి చెన్నైలో చికిత్స తీసుకున్నారు. అతనికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.10 లక్షలు చెక్కును ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు శనివారం అందజేశారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి


జాకేరులో హౌసింగ్ లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారులు

శృంగవరపుకోట: గృహ నిర్మాణ లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు పూర్తిచేసి సామూహిక గృహ ప్రవేశాలను నిర్వహించాలని వేపాడ మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ కోరారు. వేపాడ మండలం జాకేరు గ్రామంలో శనివారం నిర్వహించిన హౌసింగ్ డేలో ఆయన పాల్గొన్నారు. గృహ నిర్మాణానికి అవసరమైన రుణ సదుపాయం ఐకేపీల ద్వారా పొందవచ్చని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణంరాజు, ఎంపీడీఓ పట్నాయక్, ఉపాధిహామీ ఏపీఓ సన్యాసినాయుడు, ఐకేపీ ఏపీఎం శ్రీనివాసరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంత్రి పరామర్శ



పాపినాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

గుర్ల: మండలంలోని గరికివలస మాజీ సర్పంచ్ బెల్లాన పాపినాయుడు కుటుంబాన్ని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు శనివారం పరామర్శించారు. పాపినాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు, జెడ్పీటీసీ సీ శీర అప్పలనాయుడు, పొట్నూరు సన్యాసినాయుడు, తోట తిరుపతిరావు ఉన్నారు.

ఉత్సాహంగా కొత్త సంవత్సర వేడుకలు



రంగులు కొనుగోలు చేస్తున్న యువతులు

గజపతినగరం: నూతన సంవత్సర వేడుకలు యువత ఉత్సాహంగా జరుపుకుంటున్నారు. ఇళ్ల ముందు రంగవల్లులు వేసి కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. పట్టణంలోని బజారువీధి, వినాయక కోవెలవీధి, జాతీయ రహదారి వద్ద నూతన సంవత్సర వేడుకలను స్థానికులు ఉత్సాహంగా చేసుకున్నారు. ఒకరికొకరు కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకుంటూ సందడి చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



కొత్తవలస: ఎంపీపీ, జెడ్పీటీసీలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న ఉపాధ్యాయులు

కొత్తవలస: మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) కొత్తవలస మండల శాఖ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, జెడ్పీటీసీ నెక్కలి శ్రీదేవి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు సంబంధించిన నమూనా ప్రశ్నపత్రాలను విడుదల చేశారు. ప్రజలకు, ఉపాధ్యాయులకు యూటీఎఫ్ తరపున కొత్త సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండలశాఖ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్.నిర్మలాదేవి, జి.విజయగౌరి తదితరులు పాల్గొన్నారు.



మెరకముడిదాం: క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పీఆర్టీయూ నాయకులు

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

మెరకముడిదాం: మండల రిసోర్స్ కేంద్రం వద్ద పీఆర్టీయూ కొత్త సంవత్సర క్యాలెండర్‌ను రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఆల్తి రాంబాబు శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు ఆర్.సింహాద్రి, ఎ.శ్రీహరిరావు, ఎల్.సన్యాసిరావు, ఎ.మహేష్, కృష్ణమూర్తి, బి.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి బొత్స పర్యటన

చీపురుపల్లి: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆదివారం చీపురుపల్లిలో పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసులునాయుడు, బెల్లాన వంశీకృష్ణ తెలిపారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారన్నారు. పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

మెరకముడిదాంలో జెడ్పీ చైర్మన్ పర్యటన

మెరకముడిదాం: జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆదివారం మెరకముడిదాంలో పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు కుచ్చెర్లపాటి శివరామకృష్ణ ప్రసాద్ శనివారం తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద నూతన పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొంటారని తెలిపారు.

నేడు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

గజపతినగరం: నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా మండలవారి కాలనీ ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు చేయనున్నారని జెడ్పీటీసీ గార తవుడు, పార్టీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు తెలిపారు. అనంతరం కొత్తగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి పింఛను డబ్బులు అందజేస్తారన్నారు. 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు స్థానిక పార్టీ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారని అన్నారు.

ధాన్యం కుప్పలు దగ్ధం



ధాన్యం కుప్పలను పరిశీలిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లిలో ధాన్యం కుప్పలకు శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. ఆరుగాలం కష్టపడి పండించుకున్న ధాన్యం అగ్నికి ఆహుతవ్వడంతో బాధిత రైతులు బౌరుబిల్లి అప్పలనాయుడు, రామునాయుడు, సన్యాసి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎంపీటీసీ మంత్రి అప్పలనాయుడు, ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి శనివారం ధాన్యం కుప్పలను పరిశీలించి, బాధితులను పరామర్శించారు. ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్యతో పాటు అధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. మాజీ సర్పంచ్‌లు మహదేవ్ ఫణీంద్రుడు, రెడ్డి సింహాచలం, చుక్క మురళీ ఉన్నారు.

● ఎస్సైకి ప్రశంసలు



ఎస్పీ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎస్సై సన్యాసినాయుడు

చీపురుపల్లి: విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరచిన ఎస్సై ఎ.సన్యాసినాయుని ఎస్పీ ఎం.దీపిక శనివారం అభినందించారు. గత నెలలో అత్యధికంగా ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేసినందుకుగాను ఆయనకు ప్రశంసా పత్రం అందజేశారు.



గజపతినగరం: ఎస్పీ చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎస్సై గంగరాజు

గజపతినగరం: రహదారి ప్రమాదాల నివారణకు కృషిచేసిన గజపతినగరం ఎస్సై గంగరాజుకు జిల్లా ఎస్పీ దీపికా పాటిల్ అభినందించారు. విజయనగరంలో శుక్రవారం రాత్రి ఉత్తమ సేవా పురస్కారం, ప్రశంసాపత్రం అందజేశారు.

● ధాన్యం కొనుగోలుపై జేడీ ఆరా



కళ్లేంపూడిలో ధాన్యం కొనుగోలుపై రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకుంటున్న జేడీ త్రినాథ్‌స్వామి

లక్కవరపుకోట: మండలంలోని ధాన్యం కొనుగోలు ప్రక్రియను వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ కె.త్రినాథ్‌స్వామి శనివారం పరిశీలించారు. ధాన్యం కొనుగోలు మండల కమిటీ సభ్యులైన తహసీల్దార్, ఎంపీడీఓ, ఏఓలతో సమావేశమైయారు. ఎఫ్‌టీఓలు ప్రక్రియ, పెండింగ్ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలను వేగవంతం చేయాలని చూచించారు. అనంతరం కళ్లేంపూడి గ్రామంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏడీఓ ఎల్.విజయ, ఏఓ స్వాతికుమారి తదితరులు పాల్గొన్నారు.

హిందూ దేవుళ్లను అవమానిస్తే ఊరుకోం..

శృంగవరపుకోట: హిందూ దేవుళ్లను అవమానిస్తే ఊరుకునేది లేదని ఆదిభట్ల కళాపీఠం విజయగనగరం జిల్లా అధ్యక్షుడు గోవింద ప్రకాశ్ అన్నారు. అయ్యప్ప స్వామిని కించపరుస్తూ మాట్లాడిన భైరి నరేష్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శనివారం స్థానిక పోలీస్ స్టేసన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశం లౌకిక రాజ్యమని, అన్ని మతాలవాని అన్నదమ్ముల్లా భావించే సంప్రదాయం మనదని అన్నారు. భైరి నరేష్ వ్యాఖ్యలు మత విద్వేషాలను రెచ్చగొట్టేలా ఉన్నాయన్నారు. అతనిపై కేసు నమోదు చేయాలని పోలీసులను కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో ఎం.ధర్మారావు, వి.కృష్ణ ఉన్నారు.



ఎస్.కోట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న గోవింద ప్రకాశ్, తదితరులు

మొక్కజొన్న సాగుపై ఆసక్తి



పాత శ్రీరంగరాజపురంలో సాగుచేస్తున్న మొక్కజొన్న పంట

- గజపతినగరం వ్యవసాయశాఖ సబ్‌డివిజన్ పరిధిలో పెరిగిన మొక్కజొన్న సాగు విస్తీర్ణం
- ఈ ఏడాది 3318 ఎకరాల్లో సాగు
- వ్యవసాయశాఖ ఏడీఏ కె.మహరాజన్

గజపతినగరం: మొక్కజొన్న సాగుపై సబ్‌డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల రైతులు ఆసక్తి చూపుతున్నారు. రైతుల ఆసక్తికి అనుగుణంగా వ్యవసాయశాఖ సిబ్బంది మొక్కజొన్న సాగులో మెలకువలు, యాజమాన్య పద్ధతులపై గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తూ వారిని ప్రోత్సహిస్తున్నారు. సాగునీటి వసతి ఉన్న ప్రాంతాల్లో గతకొన్నేళ్లుగా ఖరీఫ్ వరికోతలు పూర్తయిన వెంటనే రైతులు మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ప్రభుత్వం రాయితీపై విత్తనాలు, సాగు యంత్ర పరికరాలు అందిచండంతో పాటు పంట నిల్వకు గోదాంలు నిర్మించడం, మద్దతు ధర ప్రకటించడంతో ఏటా మొక్కజొన్న సాగు రైతుల సంఖ్య, సాగు విస్తీర్ణం పెరుగుతూవస్తోంది. విత్తు దశలో 15రోజులకు ఒకసారి, 30 నుంచి 35 రోజులకు, పూతదశలోను, పూత వచ్చిన 15 రోజులకు, గింజ పాలు పోసుకొనే దశలో నీటి తడులు అందించడంతో పాటు సరైన యాజమాన్య పద్ధతులు పాటించినట్లయితే అనుకున్న దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

సబ్‌డివిజన్ పరిధిలో మొక్కజొన్న సాగు వివరాలు..
గజపతినగరం మండలంలో గత ఏడాది 1078 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయగా.. ఈ ఏడాది 1660 ఎకరాల్లో పంట సాగుచేస్తున్నారు. దత్తిరాజేరు మండలంలో గత ఏడాది 685 ఎకరాల్లో సాగు చేయగా.. ఈ ఏడాది 853 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మెంటాడ మండలంలో గతంలో 523 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయగా.. ప్రస్తుతం 643 ఎకరాల్లో సాగవుతోంది. బొండపల్లి మండలంలో గతంలో 35 ఎకరాల్లో పంట వేయగా.. ఈ ఏడాది 163 ఎకరాలకు పెంచారు. గజపతినగరం వ్యవసాయశాఖ సబ్‌డివిజన్ పరిధిలో మొత్తం 3318 ఎకరాల్లో మొక్కజొన్న సాగవుతోంది.

సకాలంలో నీటి తడులు అందిస్తే మంచి దిగుబడులు



మొక్కజొన్న సాగు చేసే రైతులు సకాలంలో నీటి తడులు పెట్టుకుంటె అనుకున్న దిగుబడులు సాధించవచ్చు. దీర్ఘకాలిక వంగడాలకు ఒకటి లేదా రెండు సార్లు నీటి తడులు ఇస్తే సరిపోతుంది. పూత దశలో రైతులు అప్రమత్తంగా ఉంటూ వ్యవసాయశాఖ అధికారులు చెప్పిన సూచనలు పాటిస్తే నష్టాలను అధిగమించవచ్చు.
– ధనలక్ష్మి, మండల వ్యవసాయాధికారి

మరింత పెరిగే అవకాశం



గజపతినగరం వ్యవసాయశాఖ సబ్ డివిజన్ పరిధిలో నీటి వసతులు ఉన్నచోట రబీలో మొక్కజొన్న సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం 2075 ఎకరాల్లో పంట సాగుచేస్తున్నారు. మరో వారం పదిరోజుల్లో సాగు విస్తీర్ణం మూడు వేల ఎకరాలకు చేరే అవకాశం ఉంది.
– కె.మహరాజన్, వ్యవసాయశాఖ ఏడీఏ

మద్దతు ధర పెంచడం సంతోషం



గత ఐదేళ్లుగా మొక్కజొన్న సాగు చేస్తున్నాను. వరి పంటతో పాటు మొక్కజొన్న పంటను సమాన విస్తీర్ణంలో సాగు చేస్తున్నాను. కొత్త శ్రీరంగరాజపురంలో అనేక మంది రైతులు వరిపంట తర్వాత మొక్కజొన్నను సాగు చేస్తున్నారు. గతంలో ప్రభుత్వం రూ.1870 మద్దతు ధర చెల్లించేది, ఈ ఏడాది దాన్ని రూ.1962కు పెంచడం సంతోషంగా ఉంది.
– ఇజ్జిరోతు చిన్నంనాయుడు, మొక్కజొన్న రైతు, కొత్తశ్రీరంగరాజపురం

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కొత్తవలస: వియ్యంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న రెండు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఐదు సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ ఆర్.ఉమాదేవి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కొత్తవలస మండలం ముమ్మనవానిపాలెం (ఎస్సీ), వేపాడ మండలం చిట్టివానిపాలెం (ఓసీ) కేంద్రాల్లో కార్యకర్త పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే కొత్తవలస మండలం దేసుపాత్రునిపాలెం (బీసీ–బీ), అప్పన్నదొరపాలెం (బీసీ–ఏ), కర్రిచిన్నయ్యపాలెం (బీసీ–బీ), లక్కవరపుకోట మండలం మార్లాపల్లి (ఎస్సీ), వేపాడ మండలం జగ్గయ్యపేట (ఓసీ) కేంద్రాల్లో సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై, 21 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు కలిగిన స్థానిక మహిళా అభ్యర్థులు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 7వ తేదీ సాయంత్రం 5గంటల లోగా ఐసీడీఎస్ పీఓ కార్యాలయంలో నేరుగా కానీ, రిజిస్టర్ పోస్టులో కానీ దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



హౌసింగ్ లబ్ధిదారులతో మట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి దుర్గాప్రసాద్

బొండపల్లి: జగనన్న లేఅవుట్‌ల్లో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులంతా వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించాలని మండల ప్రత్యేకాధికారి దుర్గాప్రసాద్ సూచించారు. మండలంలోని గొట్లాం పంచాయతీ పరిధి జియ్యన్నవలస గ్రామంలోని లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణదారులతో శనివారం సమావేశమయ్యారు. కాలనీల్లో అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తున్నందున త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రా, ఎంపీడీఓ ఎ.వేదవతి, ఏపీఓ కృష్ణవేణి, వైస్ ఎంపీపీ మీసాల సరోజిని, గొట్లాం పీఏసీఎస్ చైర్మన్ మహంతి రమణ, నాయకులు మీసాల తులసీరాం తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజలకు అండగా సీఎం జగన్



లబ్ధిదారులకు బుక్‌లెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: పేద ప్రజలకు అండగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఉన్నారని, అందుకే సంక్షేమ పథకాలతో వారిని ఆదుకుంటున్నారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని కొండరాజుపేట పంచాయతీ పరిధిలోని జగన్నాథపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం పనితీరుపై ఆరా తీయడంతో పాటు ఒక్కో కుటుంబానికి సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, సర్పంచ్ సరగడ కల్యాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు సరగడ బంగారురెడ్డి, ఎంపీడీఓ స్వరూపారాణి, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

దారపైడమ్మ ఆలయాన్ని దేవదాయశాఖలో విలీనం చేయొద్దు



సమావేశమైన గ్రామస్తులు

కొత్తవలస రూరల్: మండలంలోని అప్పన్నదొరపాలెంలో కొలువుదీరిన శ్రీదారపైడమ్మ తల్లి ఆలయ హుండీ కానుకల ఆదాయం, భూముల వ్యవహారం, తదితర అంశాలపై వివాదం నెలకొనడంతో గ్రామ సర్పంచ్ జోడు రాములమ్మ, కొత్తవలస సీఐ బాలసూర్యారావుతో కలిసి జిల్లా ఉన్నతాధికారులను ఆశ్రయించారు. దీంతో ఈ ఆలయాన్ని దేవదాయశాఖలో విలీనం చేసేందుకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే సోమవారంలోగా తెలియజేయాలని ఆలయానికి, గ్రామ పంచాయతీకి నోటీసులు జారీ చేశారు. ఆలయ వివాదం నేపథ్యంలో గ్రామస్తులు రెండు వర్గాలుగా విడిపోయారు. స్థానిక సర్పంచ్ జోడు రాములమ్మ, ఎంపీటీసీ ఉగ్గిన గురూజీ, రాంబాబు, గ్రామ పెద్దలు, గ్రామస్తులతో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అందరూ అమ్మవారి ఆలయాన్ని దేవదాయశాఖలో విలీనం చేయొద్దంటూ తీర్మానించిన ఏకాభిప్రాయాన్ని పోలీసుల సమక్షంలో సభలో చదివి వినిపించారు. అమ్మవారికి హుండీ ఆదాయం, అమ్మవారికి భక్తులు సమర్పించిన బంగారు, వెండి తదితర కానుకలను ప్రజల సమక్షంలో బహిరంగ పరచాలని, అమ్మవారి ఆలయ అభివద్ధికి సహకరించాలని సర్పంచ్ జోడు రాములమ్మ డిమాండ్ చేయడంతో ఎంపీటీసీ భర్త, మాజీ సర్పంచ్ ఉగ్గిన రాంబాబు, చొరవ తీసుకొని గ్రామస్తులకు ఆయా వివరాలను తెలియజేసే బాధ్యత తీసుకున్నారు. ఆలయ కొత్త కమిటీ ఏర్పాటుకు అందరూ ఆమోదం తెలిపారు. మంగళవారం నూతన కమిటీ ఏర్పాటు చేస్తామని గ్రామస్తులు తెలిపారు.

మార్కెట్ కమిటీ బలోపేతానికి కృషి

- ఏఎంసీ చైర్‌పర్సన్ శశిభార్గవి



బాధ్యతలు చేపడుతున్న ఏఎంసీ చైర్‌పర్సన్ శశిభార్గవి

విజయనగరం ఫోర్ట్: అధికారులు, పాలకమండలి సహకారంతో రైతులకు అండగా ఉంటూ మార్కెట్ కమిటీని మరింత బలోపేతం చేస్తానని వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్‌పర్సన్ ఎస్‌వీవీ శశిభార్గవి అన్నారు. శనివారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మార్కెట్ కమిటీ పాలక మండలి పదవీ ప్రమాణ స్వీకారం జరిగింది. బాధ్యతలు చేపట్టిన ఆమెను పలువురు అభినందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు, ఏఎంసీ వైస్‌చైర్మన్ రెడ్డి గురుమూర్తి, జొన్నవలస పీఏసీసీఎస్ అధ్యక్షుడు కెల్ల త్రినాథ్, వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జులు బొద్దాన అప్పారావు, బోడసింగి ఈశ్వరరావు, కర్రోతు నారాయణరావు, బి.అప్పలకృష్ణ, సత్తిరాజు, తదితరులు పాల్గొన్నారు.

మునగ మొక్కల పంపిణీ

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఎంపీపీ మహంతి కల్యాణి వివిధ గ్రామాల సమైక్య సంఘ సభ్యులకు శనివారం మునగ మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మొక్కల ద్వారా ఫలసాయం పొంది ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ఎంపీడీఓ జి.రామారావు, తహసీల్దార్ ఇ.భాస్కరరావు, వెలుగు ఏపీఎం పెంటంనాయుడు పాల్గొన్నారు.

మరింత మందికి ఆరోగ్యశ్రీ సేవలు

విజయనగరం ఫోర్ట్: ఆరోగ్యశ్రీ సేవలు ఎక్కువ మంది వినియోగించుకునేలా చూడాలని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ ఉప్పు అప్పలరాజు అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆరోగ్య మిత్రలకు శనివారం సెల్‌ఫోన్‌లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నెట్‌వర్క్ ఆస్పత్రులకు వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలన్నారు. అన్ని రకాల సేవలు ఉచితంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీమ్ లీడర్లు తుంపల్లి జనార్దనరావు, భానుప్రసాద్, రాయవరపు ముత్యాలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సుఖసంతోషాలతో వర్ధిల్లాలి

నెల్లిమర్ల: నూతన సంవత్సరంలో ప్రజలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నేతలంతా సుఖసంతోషాలతో జీవించాలని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు ఆకాంక్షించారు. శనివారం ఆయన మాట్లాడుతూ, 2023వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న శుభ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలంతా అభివృద్ధిపథంలో పయనించాలన్నారు. అన్నివర్గాల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గొట్లాం విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బొండపల్లి: గొట్లాం ఉన్నత పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు అర్హత సాధించినట్లు పీడీయూఎస్ సత్యానంద్, హెచ్ఎం శ్రీరామాచారి తెలిపారు. ఇటీవల పెద్దమజ్జిపాలెంలో జరిగిన జిల్లాస్థాయి అండర్–14,17,19 పోటీల్లో విద్యార్థులు కె.రిషేంద్ర, ఎస్.భారతి, డి.రేష్మ, కె.వర్మ, టి.అనిల్, ఎం.శశివర్ధన్, ఎల్.స్పందన ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు చెప్పారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

కొత్త సందడి...

కొత్త సంవత్సరానికి స్వాగతం పలికేందుకు జిల్లా వాసులు సన్నద్ధమయ్యారు. ఈ క్రమంలో కేక్‌లు, రంగులు, పూలబొకేలు కొనుగోళ్లతో జిల్లా కేంద్రంలోని గంటస్తంభం మార్కెట్ శనివారం సాయంత్రం కిటకిటలాడింది. బేకరీలు, స్వీట్‌షాపు యజమానులు వివిధ రకాల కేక్‌లను సిద్ధం చేయగా... గంటల వ్యవధిలో అమ్ముడుపోయాయి. అలాగే మహిళలు ఇళ్ల ముందు ముగ్గులు వేసేందుకు రంగులు.. అధికారులు, ప్రజా ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలియజేసేందుకు ప్రజలు పూలబొకేలు, దండలు కొనుగోలు చేశారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



గంటస్తంభం సాక్షిగా కేకుల విక్రయాలు



కిటకిటలాడుతున్న మార్కెట్



రంగులు కొనుగోలు చేస్తున్న బాలికలు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న పూలబొకేలు



కేక్‌లు కొనుగోలు చేస్తున్న బాలికలు

క్లుప్తంగా

రేషన్ దుకాణాల్లో తనిఖీలు



గజపతినగరంలో రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న సివిల్‌సప్లై డీఎం

గజపతినగరం: రేషన్ దుకాణాల్లో ఎటువంటి అవకతవకలు జరిగినా, సరుకుల నిల్వల్లో తేడా ఉన్న, రికార్డుల్లో తప్పులు ఉన్నా సహించేది లేదని విజయనగరం సివిల్ సప్‌లై డీఎం మీనాకుమారి అన్నారు. మండల కేంద్రంలోని చీకటి ముత్యాలు, పురిటిపెంటలో రమాదేవి నిర్వహిస్తున్న రేషన్ దుకాణాలను శనివారం సాయంత్రం ఆమె తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ, సరుకుల నిల్వల్లో ఎలాంటి లోటుపాట్లు లేకపోవడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అక్రమాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

రైస్‌మిల్లు ఆకస్మిక తనిఖీ

గజపతినగరం: రైతుభరోసా కేంద్రాల ద్వారా మిల్లులకు వస్తున్న ధాన్యం నాణ్యతను సిబ్బంది సక్రమంగా తనిఖీ చేస్తున్నదీ లేదని సరిచూడాల్సిన బాధ్యత రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులదే అని పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ రవిశంకర్‌ను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుదర్శన్ దొర ఆదేశించారు. మండలంలోని ఎన్‌జీఆర్‌పురం గ్రామంలోని శ్రీవాసవి ఏజీఆర్ ఫుడ్ ఇండస్ట్రీస్ (రైస్ మిల్లు) శనివారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ వివరాలు, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రైతులకు ఆర్‌బీకేల వద్ద గానీ, మిల్లర్ల వద్ద గాని ఎటువంటి ఇబ్బందులు ఎదురైనట్లు ఫిర్యాదులు అందితే సహించేది లేదని స్పష్టం చేశారు.

ఏపీజీఈఏ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ గిరిబాల

నెల్లిమర్ల: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయుల సంఘం నెల్లిమర్ల తాలూకా శాఖ రూపొందించిన 2023 నూతన క్యాలెండర్‌ను నెల్లిమర్ల మండల ప్రజాపరిషత్ అధికారి జి. గిరిబాల శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సహ అధ్యక్షుడు హెచ్. భానోజీరావు, ఈఓపీఆర్‌డీ పి.వీరన్నదొర, పి.శంకరరావు, పి.సర్వేశ్వరరావు, బి.శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతి చెందిన శ్రీనివాస్

పద్మనాభం: పద్మనాభం మండలం నరసాపురం గ్రామ సమీపంలోని కరకబంద వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. పద్మనాభం ఎస్ఐ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం జిల్లా విజయనగరం మండలం బడుకొండపేట గ్రామానికి చెందిన బడుకొండ శ్రీనివాస్(30) గొనె సంచుల కోసం తమ గ్రామం నుంచి బైక్‌పై శనివారం ఉదయం పద్మనాభం మండలం తునివలస పంచాయతీ నరసాపురంలో ఉన్న అమ్మమ్మ గారి ఇంటికి బయలుదేరాడు. మార్గంమధ్యలో నరసాపురం గ్రామ సమీపంలోని కరకబంద వద్ద మంచు వల్ల దారి కనిపించకపోవడంతో కూలీలను విజయనగరం తీసుకువెళుతున్న టాటీ ఏసీని ఢీకొట్టాడు. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం విజయనగరం మహారాజ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే శ్రీనివాస్ మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడు భార్య రేవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతుడు శ్రీనివాస్‌కు వివాహమై రెండో ఏడాది నడుస్తోంది. శ్రీనివాస్ పెయింటింగ్ కాంట్రాక్టర్ వర్క్‌తో పాటు వ్యవసాయ పనులు చేస్తుంటాడు. మృతుడికి భార్య రేవతితో పాటు నాలుగు నెలల కుమారుడు, తమ్ముడు నాగరాజు, తల్లిదండ్రులు ఉన్నారు.

విద్యారంగ అభివృద్ధికి విప్లవాత్మక నిర్ణయాలు

డెంకాడ: విద్యారంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకుని, అమలు చేస్తోందని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని జగన్నాథపురం కేజీబీవీలో విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబ్‌లను శనివారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, ఎంఈఓ అంబళ్ల కృష్ణారావు, ఎంపీడీవో స్వరూపారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు సరగడ బంగారురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరి అరెస్ట్

విజయనగరం క్రైమ్: గంజాయి తాగుతున్న ఇద్దరు యువకులను వన్‌టౌన్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక ఉడా కాలనీ శివారు ప్రాంతంలో ఇద్దరు యువకులు గంజాయి తాగుతుండగా వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మొదటి విడతగా మందలించామని, ఇకపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.